జయజయ శంకర



హరహర శంకర

సంపుటి : 2 సంచిక : 9 & 10


# శ్రీ కామకోటి వాణి

శ్రీ క్రోధినామ వైశాఖ - జ్యేష్ఠ మాసం, జూన్ - జూలై 2024



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము

# శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామివారి కాశీ యాత్ర సుసంపన్నం








శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామివారు **2023**లో కాశీ యాత్రను చేపట్టిన విషయం తెలిసినదే. ఆ సందర్భంగా స్వామివారు గంగా నది తీరాన వ్యాస పూర్ణిమ పూజ, చాతుర్మాస్య వ్రతము, మరెన్నో వేద పారాయణాలు, అతిరుద్ర హోమాలు నిర్వహించి తదుపరి అయోధ్య రాముడి తత్త్వ న్యాసము గావించి, శ్రీశైల ఆలయ శిఖరాలను కుంభాభిషేకముతో పులకించి కాంచీపురానికి చేరుకున్నారు.

శ్రీ స్వామివారు ఆనాడు గంగానది పావన తీర్థమును సేకరించి తీసుకొచ్చి ఈనాడు, **17** జులై **2024**న రామేశ్వరక్షేత్రంలో శ్రీ రామనాథ స్వామి వారికి ఆ గాంగాజలముతోనే అభిషేకాము చేసి కాశీ యాత్రను సఫలంగా సంపూర్తి చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని భక్తులందరు తిలకించి తరించారు.





**17 జులై 2024:** అగ్నితీర్థం వద్ద ఉన్న శ్రీ కంచి కామకోటి మఠము నుండి శ్రీ రామనాథస్వామి వారి గుడికి మేళ తాళాల ధ్వనుల మధ్య స్వామివారు ఊరేగింపుగా గంగాజల కలశమును తీసుకువెళ్లారు.



**17 జులై 2024:** ధనుష్కోటి వద్ద స్వామివారి సాగర వందనం

# సదాచార ప్రధానమైన జీవితం కీలకం



యాకుందేందు తుషారహార ధవళా యా శుభ్రవస్త్రాన్వితా
యా వీణా వరదండ మండిత కరా యా శ్వేత పద్మాసనా
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిః దేవైః సదావందితా
సామాంపాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా

మీరందరూ కూడా ఈ రోజు, నిన్న రెండు రోజుల నుంచి అనేక సంస్కృతి, సంస్కృత, సంగీత కార్యక్రమాలను జరిపిస్తున్నారు.

మానవ జీవితంలో వికాసానికి విద్య ఎడ్యుకేషన్ లేదా చదువు అనేది ముఖ్యమైన విషయం. ఈ భారతదేశం, ఇది వరకు విశాఖ హరిగారు చెప్పినట్లుగా అనేకమంది ఈ కాంచీపురానికి అంటే కాంచీకి వచ్చి చదువుకొని వెళ్ళారు. ఒక కాలంలో, ఒక సందర్భంలో, ఒక సమయంలో పర్మా కావచ్చు, శర్మా కావచ్చు... అందరూ ఇక్కడికి వచ్చి మంచి విద్యను అభ్యసించి, వారు వారు ఉన్నచోటుకు తిరిగి వచ్చి ధర్మప్రచారం చేశారు. ధర్మం అనేది ప్రచారం కోసం వచ్చిన విషయం కాదు. ప్రచారంతోనే ధర్మం ఆచరణలోకి వచ్చేది కాదు.

మన దేశంలో భాష ఎంత ముఖ్యమో, భాషతో పాటు భక్తి, భావన కూడా ముఖ్యం. గుణాలు ముఖ్యం. గుణ ప్రధానమైన జీవితం, భక్తి ప్రధానమైన జీవితం, సదాచార ప్రధానమైన జీవితం మానవ జీవితంలో ముఖ్యమైన విషయం. అలా సదాచారాన్ని మనం ఎక్కడి నుండి నేర్చుకుంటాం అంటే మన ముందు తరాల నుంచి, దేవాలయాల నుంచి, మంచి గురుకులం నుంచి, మంచి కుటుంబం నుంచీ ఈ సద్విద్యను నేర్చుకుంటాం.

అలా మంచి విషయాలను నేర్చుకోవడానికి ఈ రోజు లౌకిక విద్య అయితే ప్రధానం. వృత్తిరీత్యా అంటే ఉద్యోగానికి గాని, వ్యాపారానికి గాని ఈ రోజు పూర్వ విద్య, లౌకిక విద్య అవసరం ఉన్నది. ఆవశ్యకత ఉన్నది. దానితోపాటు తరతరాలుగా ఏదైతే ఒక సంస్కృతి, సభ్యత, సదాచారం ఉన్నదో, మన జీవితం కాఠిన్యం లేకుండా, కల్మషం లేకుండా, కష్టం లేకుండా సుఖ జీవితంగా, శాశ్వతీ శాశ్వతైశ్వర్య అని అశాశ్వతమైన ఐశ్వర్యాలు అంటే భక్తి, శాశ్వత ఐశ్వర్యం

సత్ప్రవృత్తి. ఈ ఉదయం ఈవిడ, కృష్ణమూర్తి శాస్త్రిగారి భార్య మాట్లాడుతున్నప్పుడు సంస్కృతంలో కొంతవరకూ మాట్లాడారు. తర్వాత తెలుగులో కూడా! ఎప్పుడో 40 సంవత్సరాలకు ముందు రెండు సంవత్సరములు కంచిలో, తిరుపతిలో ఉన్నవారి పరిచయంతో ఈ తెలుగు భాషను గుర్తు పెట్టుకొని మాట్లాడారు. అలా మన సదాచారం



ఉండాలి. ముగ్గులు వేయాలి. గోమయంతో మనం శుద్ధి చేయాలి. ఇలాంటి విషయాలన్నీ కూడా మీకు నేర్పడం జరిగింది.

అంటే, భాష, ప్రదేశం ఎక్కడి నుంచి వచ్చినా అందరినీ కలిపే విషయం భక్తి, వినమ్రత, ప్రేమ శ్రద్ధ, స్నేహం త్యాగం. ఇవన్నీ అందరినీ కూడా ఒక మండపానికి తీసుకువచ్చి ఇలా సత్ప్రవర్తనను కలిగిస్తుంది. సత్ సంకల్పాన్ని కలిగిస్తుంది. అలాంటి మన కర్మదేశంలో ఇది ఒక పుణ్య భూమి, పవిత్ర భూమి, విద్యా భూమి. ఒక సమయంలో అంటే విదేశంలో ఈ రోజు ఏదైతే విజ్ఞానం/ సైన్స్ మనం చూస్తున్నామో అక్కడ ప్రచోదయం వచ్చే ముందు నుంచే ఇక్కడ సాధనాల సహకారం లేకుండా కూడా మన మహర్షులు ఎంతో విజ్ఞానాన్ని ఆయుర్వేదం కావచ్చు, జ్యోతిష్యం కావచ్చు, పంచభూతాలకు సంబంధించిన అనేక విజ్ఞానాన్ని వారు తపస్సు చేత కనిపెట్టి, ఈ ప్రజానీకానికి అందచేశారు. అందుకని, ఈ భారతదేశమనేది విశ్వాస భూమి, వికాస భూమి, విజ్ఞాన భూమి. ఆ విశ్వాసము, వికాసము, విజ్ఞానము మూడూ కలగాలంటే సంతృప్తి కలగాలి. నిరాడంబరమైన జీవితం ఉండాలి.

అసూయ, ద్వేషం, అహంకారాల నుంచి మనం బయటకు వచ్చి దాని నుంచి మనం వినమ్రత, విజ్ఞానంతో కనుక మన ఇంటి పనులు కావచ్చు, సామాజిక కార్యక్రమాలు కావచ్చు మనం స్వాభిమానంతో చేయాలి.

స్వాభిమానం అంటే, స్వా అనే అభిమానం, అంటే లోకాభిమానంతో కూడా చేయాలి. స్వాభిమానం అవసరం. స్వాభిమానం అంటే మన పనిని మనం చేసుకోవడం.

అన్నింటికీ ఈ రోజు సౌకర్యాలు వచ్చాయి. అవి, కాల్క్యులేటర్ కావచ్చు, మిక్సీ కావచ్చు, గ్రైండర్ కావచ్చు, దుస్తులు ఉతికేందుకు వాషింగ్ మెషీన్ కావచ్చు.


కానీ మన పనిని మనం చేసుకోవడానికి అవసరమైన శక్తి, అలాంటి సంకల్పాలు కూడా మనలో ఉండాలంటే, దీనివలన మనకు సమయం అనుకూలం అవుతుంది. పెద్దవాళ్ళకు ఇన్ స్ట్రుమెంట్స్ అవసరం. కానీ, చిన్న వయసులో అందరూ కూడా ఇన్ స్ట్రుమెంట్స్, మెషీన్స్ వాడినా కూడా, దానివల్ల మనకు అందుబాటులో ఉండే సమయం, లేదా ఏదైతే టైమ్ సేవింగ్ మనకు జరుగుతుందో దానిని మానస కీర్తనం కాని, మన సాహిత్యాలు, సంగీతాలు అభ్యసించేందుకు ఉపయోగించాలి. అంతే తప్ప, సమయాన్ని వ్యర్థం చేయకుండా చేయకుండా ఉండాలి. అయితే, వైష్ణవంలో ఉన్నవారు చెప్తారు కాలక్షేపం అని.. కాలక్షేపం అంటే మంచి విషయాలకి, భగవత్ విషయాలకు సమయాన్ని కేటాయించడం, కాలక్షేపం అనేది భక్తి సంప్రదాయంలో ఉన్నది. కానీ, మనం చేసే కాలక్షేపం అనేది మంచి విషయంలో మన సమయాన్ని ఉపయోగిస్తూ చదువులో కాని, సేవలో కాని, ధ్యానంలో కాని, అతిథి సత్కారంలో కాని, మాతృదేవోభవ, పితృదేవోభవ వంటి వేదంలో చెప్పిన ఉపదేశాన్ని, సందేశాలను మనకు మనం తెలుసుకొని, అవగాహన చేసుకొని, మన జీవితంలో కేవలం పారాయణతో ఆపకుండా దానిని కార్యరూపంలో మనం చేయడానికి ఇలాంటి పర్యావరణం లేదా వాతావరణం అవసరం.

ఈ మధ్యకాలంలో దేశ స్వాతంత్ర్యాన్ని గురించి చెప్పారు. దేశ స్వాతంత్ర్యం, ఇండిపెండెన్స్ కోసం ఎంతమంది త్యాగం చేశారో అనేదాని గురించి చెప్పారు ఉపన్యాసంలో. అంటే అలాంటి అవసరం ఉండేది... చేశారు. దేశం స్వాతంత్ర్యం పొందింది. ఇప్పుడు ఇండిపెండెంట్ ఇండియా ఉన్నది. మన భారతదేశంలో పూర్ణ స్వాతంత్ర్యం మనకు ఎప్పుడు వస్తుందంటే, మనం ధర్మాన్ని ఎప్పుడు తెలుసుకుంటామో అప్పుడే పూర్ణ స్వాతంత్ర్యం కలుగుతుంది. అందుకని, ఈ పూర్ణ స్వాతంత్ర్యం కలగాలంటే ఆ పరిపూర్ణమైన బ్రహ్మ జ్ఞానాన్ని ఘనం పొందాలి. దానికి మాయా ప్రపంచం నుంచి బయటకు రావాలి.

**మిథ్యా జగదధిష్ఠానా ముక్తిదా ముక్తిరూపిణీ**
**భవదావసుధావృష్టిః పాపారణ్యదవానలా**


అలా భాగ్యాబ్ది చంద్రికా భాగ్యం, సౌభాగ్యం కలగాలంటే మనం చేయాల్సింది–

జ్ఞాన విగ్రహా అంటారు. అలాంటి జ్ఞానాన్ని పొందాలి. ఆ జ్ఞానం ఎలా వస్తుందంటే గురుభక్తితో సద్విద్యను నేర్చుకోవాలి. ఆ సద్విద్య అనేది మన దేశంలో తరతరాలుగా ప్రతి కుటుంబంలో కూడా ఉన్న విషయమే, అంటే కుటుంబంలో ప్రబోధించిన విషయమే. ఈ రోజు కుటుంబంలో సమయం కుదరక మంచి ఆచార్యులు దొరక్క సౌకర్యాల అభావం చేత ప్రోత్సాహం తక్కువ కనిపిస్తున్నది. అంటే, ప్రోత్సాహం – ఎంకరేజ్మెంట్ లేదు. కనుక, అలా కాలాంతరాల చేత... అనేక కారణాల చేత మంచి విద్యను, అంటే సంస్కృతి, సభ్యత, సదాచార సహిత విద్యను నేర్చుకోవడం దుర్లభమైన స్థితిలో, ప్రతి భారతీయ నాగరికుడూ కూడా ఇలాంటి సదాచార సంపన్నమైన వేదశాస్త్ర పరంపరలో వచ్చిన బ్రాహ్మణులు అందరూ కూడా ధర్మాన్ని తెలుసుకోవాలి. వేద సందేశాన్ని తెలుసుకోవాలి. సంస్కృత భాష పరిచయం ప్రావీణ్యం పొందాలి. వేదం ప్రధానము... సంస్కృతము సమానము. ఏభాషకు చెందినవారైనా వేదం అనేది మనకు ప్రధానం మెయిన్ సంస్కృత భాష అనేది. మన నీతి శాస్త్రం, మన ధర్మాశాస్త్రం, మన పురాణాలు వీటి తాత్పర్యాన్ని, భావార్థాన్ని గ్రహించడానికి సంస్కృత భాష అవసరం. అందుకని మీరందరూ కూడా ఇలాంటి చదువు చదువుకునే అవకాశం వినియోగించుకోవాలి. మహారాష్ట్ర నుంచి వచ్చారు, ఆంధ్ర దేశం నుంచి వచ్చారు... ఇంకా అనేక ప్రాంతాల నుంచి అనేక విద్యలలో పరిచయాల కోసం ఈ పాఠశాలను ప్రారంభం చేశాం. శైవాగమం, పంచరాత్రం, వైఖానసం, జ్యోతిష్యం, వాల్మీకి రామాయణం, భగవద్గీత పాఠం, నమక చమక, పురుష సూక్తం, శ్రీ సూక్తాది సూక్త పాఠాలు, వేద పాఠాధ్యాయులు, సంప్రదాయ ఆడవారి కోసం... పాఠశాల ఇలాంటి విషయాలలో ఇద్దరూ ముఖ్యం, సమాజానికి స్త్రీ, కుమారి, జనస్తేషాం నృత్తం మసాతం సతాం. మగవారు అనే కాదు. సమాజంలో ఉండే అందరూ కూడా వారి వారి బాధ్యతలను సరిగ్గా సక్రమంగా నిర్వహిస్తూ ఈ మాదిరిగా, మంచిగా వారి కర్తవ్యాన్ని నిత్య కర్మానుష్ఠానం కావచ్చు, కుటుంబ మర్యాద కావచ్చు, శాస్త్ర మర్యాద కావచ్చు, వాటిని కాపాడి మన దేశం, మన ధర్మం, మన వ్యక్తిత్వం, మన సమాజమనే దృష్టితో నేను ఎవరు అని తెలుసుకోవడం అనేది వేదాంతం. రమణ మహర్షి వంటివారు అందరూ కూడా చెప్పారు. ఇక్కడ తమిళంలో నాన్ యార్,



నాన్ యార్ అంటే నేను ఎవరు అని. ఇప్పుడు మనం ఎవరు అని మొదట్లో తెలుసుకోవాలి. మనం అపౌరుషేయం అయిన వేద పరంపరలో వారము. అంటే ఒక వ్యక్తి చేత రాయబడిన విషయం కాదు. వేదం అపౌరుషేయం. (పౌరుషేయం అంటే ఒక శిల్పి ఒక విగ్రహాన్ని నిర్మాణం చేస్తాడు. ఒక కుమ్మరి పాత్రలను నిర్మాణం చేస్తాడు. ఒక విశ్వకర్మ తలుపులను నిర్మాణం చేస్తాడు. అలాంటి నిర్మాణం లేదా క్రియేట్ చేసిన విషయం కాదు) అంటే సృష్టించబడిన విషయం కాదు. అది ఆప్త వాక్యం. ఆప్తవాక్యం అంటే నమ్మకస్తులు చెప్తే మనం వింటాం. ఈయన చెప్పారు కనుక అది నిజమే అయ్యి ఉంటుంది, అందుకని నమ్మే విషయం. అందరికంటే నమ్మకం ఎవరిపై ఉంటుంది? ఈశ్వరుడు, భగవంతునిపై ఉంటుంది. ఆయన ఈశ్వరుని ఉచ్ఛ్వాస, నిశ్వాసలో భాగం కనుక ఈ వేదాలు యదార్థ వక్తం. అంటే పారమార్థిక సత్యాన్ని తెలిపిన గ్రంథాలు. ఇది రచించబడిన గ్రంథం కాదు. అపౌరుషేయ మంత్రాలు మనకు ప్రధానం. ఆ వేద విదితమైన కర్మను మనం చేయాలి. వేదంలో మంత్రాలు మనకు ఐహిక, ఆముష్మిక ఫలితాలను ఇస్తాయి. వర్షం పడాలని చెప్పారు.

లోకంలో మూడు కారణాల చేత వర్షం వస్తుంది అని ఉదయం



చెప్పారు. అంటే మంచి రాజ్యాంగం ఉంటే, వారి కోసం, మంచి ప్రభుత్వం కోసం ఒక వర్షం నెలలో ఒక రోజు పడుతుంది. మంచి వేద శాస్త్ర పండితులు నిత్యమూ సంధ్యా వందనంలతో అగ్నికార్యం, ఔపాసనం, అగ్నిహోత్రం చేస్తూ షట్కర్మ నిరతంగా యజన, యజనము, దాన, ప్రతిగ్రహము, అధ్యయనము, అధ్యాపము వీటిని షట్కర్మ నిరతులు అంటారు. అలాంటి సత్ బ్రాహ్మణుల కోసం ఒక వర్షం వస్తుంది. మూడోది ఏమి చెప్పినారు?

అఖండమైన ప్రేమకు ఉదాహరణమైన 'నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ నారీ శిరోమణి' అని ఎలా భద్రాచల కీర్తనలలో చెప్తారో, అలా నారీ శిరోమణిలా ఉన్న వారి కోసం ప్రతి నెల ఒక రోజు వర్షం కురుస్తుందని చెప్పారు.

అలా మన దేశ సంస్కృతి సంరక్షణ చేత మన లోక కళ్యాణానికి సహకరిస్తున్న వ్యక్తులుగా మనం అవుతున్నామని అలాంటి సేవ అవకాశం కూడా. ఈ సదాచార భక్తి ప్రపత్తుల చేత మనం లోకసేవ చేసే అవకాశం కూడా ఉన్నది. చదువుకోసం ఎవరైతే ఇక్కడ ఈ సంవత్సరం కొత్తగా వచ్చిన వారు అందరూ కలుసుకుని మంచిగా పాడుతున్నారు. కొత్తగా అనేక సంకీర్తనలను పాడుతున్నారు. మీరందరూ అమ్మ సేవలో అందరూ కూడా ముగ్గుల్ని వేశారని విన్నాం. ఇలా భక్తి అనేది మనకు ముఖ్యం. విద్య అనేది ముఖ్యం. కొత్త చదువులు ఏవైతే ఉన్నాయో అని కూడా మంచిగా చదువుకోవాలి. గణితం కావచ్చు, విజ్ఞానం కావచ్చు.

కొత్త కొత్త చదువులు ఏవైతే వస్తున్నాయో ఏ రోజుకు ఆ రోజు అవి కూడా మనం నేర్చుకోవాలి. అపుడేట్ అంటారు అలా ఉండాలి. సమకాలంతో మనకు సంబంధం ఉండాలి. ఆధునిక విద్యలో సమకాలంతో మన సంబంధం ఉండాలంటే కొత్తగా వచ్చిన విద్య కూడా మనం నేర్చుకోవాలి. ధర్మశాస్త్ర నమ్మకం. అలాంటి విషయాలలో పూర్వీకులకు సంబంధించిన విద్యలు ఏవైతే ఉన్నాయో ఉపాసనా మార్గం ఏదైతే ఉన్నాయో భక్తి ప్రపత్తులు, మర్యాదలు, గౌరవం, సత్యనిష్ఠ ఏదైతే ఉన్నదో, అలాంటి దినచర్య ఏదైతే ఉన్నదో అది కూడా మనం అభ్యసించాలి. అందుకని సగుణ ప్రకాశమైన వికాసం ఇంక్లూజివ్ గ్రోత్ అని ఈ రోజు చెప్తున్నారు. అట్లా ఈ చదువు మంచిగా చదుపుతూ, మంచి అవకాశం కంచిలో అందరూ కలిసి ఉండడం ఒకే చెట్టు అనేక శాఖలు. అలా ఇక్కడ వేదం, వేద సూక్తాలు, శైవాగమము, వైష్ణవాగమము, వైష్ణవాగమములతో పంచరాత్రాలు వైఖానసము, జ్యోతిష్యం ఇంకా కొత్త కొత్త చదువులు కూడా ప్రయత్నం చేస్తున్నారు. దీనికోసం పెద్ద చదువులు చదివినవారందరూ కూడా వచ్చారు. అంటే భవిష్యత్ అనేది మంచిగా ఉండాలి అనే మంచి ఉద్దేశ్యం వీళ్ళందరిలో ఉంది. కనుక, పెద్ద వయస్సు వాళ్ళు, పెద్ద చదువులు చదివినవారు కూడా కల్చరల్ ప్రోగ్రామ్, ఈవెంట్ మేనేజ్మెంట్ అని, చిన్నగా అనుకోకుండా వచ్చారు. ఉన్నతమైన, ఉదారమైన సందేశాలు ఇచ్చిన పసుద్దైక కుటుంబం అని చెప్పిన శాస్త్రాలన్నీ మనం పోషించాలి, వాటి పట్ల అవగాహన కలగాలి.

అధీతి – చదువుకోవడం. బోధ ఏదైతే చదువుతున్నామో దానిని అర్థం చేసుకోవడం. ఆచరణ – అంటే ఇక్కడ చదువుకున్న వాళ్ళు మంచిగా ప్రవర్తిస్తారు. అని పేరు తెచ్చుకోవడం.

మూడవది ప్రచారం మైకులో ప్రచారం చేయడం. ఇంకా ఇంటింటికీ వెళ్ళి ప్రచారం చెయ్యడం అనేది నాలుగవది. ఇలా ఈ నాలుగూ కూడా అవసరం. దీనితో మన దేశంలో ఈ ధర్మ సందేశాలను ప్రజల దగ్గరకు తీసుకురావడం జరగాలి. ప్రజల వద్దకు ధర్మాన్ని తీసుకురావడానికి 64 కళలు ఈ కళల్లో సంగీతం అనేది గాంధర్వ వేదం. నారద మహర్షికి అనుప్రేతమైన విద్య. త్యాగరాజు స్వామి ప్రచారం చేసిన విద్య. అద్భుతంగా ఇప్పుడు శివుని గురించి గద్యం, మహావిష్ణువు గురించి పాటలు పాడారు. నాదస్వరం మేళకర్త అంటారు. 72 మేళకర్త రాగము, ఇవన్నీ చెప్తారు.

ఆ నాద స్వరము విద్యారంగాన్ని కావేరి నగర్ సంస్థాన్ అక్కడ ఏర్పాటు చేయడం జరిగింది. మగవాళ్ళు, ఆడవాళ్ళు చదువుతారు. వాళ్ళు కూడా ఇక్కడకు వచ్చి ఈ రోజు "పశుర్వేత్తి శిశుర్వేర్తి వేర్తిగానరసం" అని స్తంభంలో సప్తస్వరమండలం అని చేసినారు.

తిరునల్వేలి, మధురై, సుచీంద్రం అలాంటి దేవాలయాలలో స్తంభంలోనే 'సరిగమ పదనిస' అని ఆ స్వరాలన్నీ వినేటట్టుగా చేశారు. సంగీతం పైన మనవాళ్ళకు ఉన్న శ్రద్ధను అది చూపిస్తుంది. నైపుణ్యాన్ని చూపిస్తున్నది. అంటే, రాయిలో స్వరం వింటాం. దానికి ఎంతో నైపుణ్యం ఉండాలి ఆ శిల్పికి.

ఢిల్లీలో మలైమందిర్ అనే చోట కూడా ఈ సంగీత స్తంభాలను కొత్తగా ఏర్పాటు చేసేందుకు కొంతవరకు ప్రయత్నం చేశారు. కానీ, ఈ పాత గుళ్ళలో ఈ సంగీత స్తంభాలు ఉంటాయి. నాదస్వరం ప్రచారం కోసం ఈ ఏర్పాటు. నాదస్వరం విద్యాశాలలు పెట్టారు. సంస్కృతి, బుర్రకథ, అష్టావధానం, సహస్రావధానం, ద్విసహస్రావధానం అన్నీ ఉన్నాయి.


సంగీతాన్ని, సాహిత్యాన్ని, సేవాభావాన్ని, వినమ్రతను కూడా మనం సరిగ్గా తెలుసుకొని, కష్టపడి చదువుకోవాలి. త్యాగం అనేది ముందు మన చిన్న వయస్సులో, పరిశ్రమ చేస్తే పెద్ద వయస్సు వచ్చినప్పుడు మనం సుఖశాంతితో మంచిగా ఉండవచ్చు.

శైశవంలో, కౌమార వయసులో మంచి చదువు చదువుకొని ఏకాగ్రత, శ్రద్ధ, భక్తి, విశ్వాసంతో, గురుభక్తితో, గురుశుశ్రూషతో, మనం మంచి విషయాలను– భాగవతం, రామాయణం, అన్నమాచార్య సంకీర్తనలు, కుమారీ శతకం, కుమార శతకం, కాళహస్తీశ్వర శతకం, సుమతీ శతకం వంటి మంచి విషయాలు అన్నీ కూడా తెలుసుకొని, అలాంటి మంచి సదాచారంలో ఉండి ఆగమాలు, శాస్త్రాలన్నింటినీ కూడా పోషిస్తూ తద్వారా పెద్ద ధార్మిక సమాజంలో మనం కూడా ఒక అనుకూలమైన యోగదానం చేయాలి. పార్టిసిపేషన్– మనం కూడా భాగస్వాములం అవుతాం అంటారు. భాగస్వామ్యం అంటే మనం కూడా భాగం అవ్వాలంటే మనం అది అభ్యసించాలి. చదువుకోవాలి. ఇలాంటి మంచి విషయంతో ఈ కార్యక్రమం మంచిగా జరిగింది. యోగాభ్యాసం కూడా మధ్యాహ్నం చూపించనున్నారు. ఇప్పుడు కూడా యోగాను ఇక్కడివాళ్ళు, కంచివాళ్ళూ చేస్తున్నారు.

ఇలా శారీరక, మానసిక, వాచిక అనేక ప్రకారమైన ధర్మప్రచారాన్ని మంచిగా చేస్తూ దివ్యక్షేత్రంలో చదువుతున్నారు. కలియుగంలో ముఖ్యమైన క్షేత్రం ఇది.

ఇలా ఈ సంగమం అనేది ప్రతి సంవత్సరం కూడా ఇలాంటి ఒక కార్యక్రమం చేస్తూ మీ అందరూ కలవడానికి ఇది ఒక అవకాశం. ఇది వాడుకొని "ధర్మో రక్షతి రక్షితః" అని ధర్మానికి రక్షగా ఉండటానికి ప్రయత్నం చేసుకోవాలి.

**జయ జయ శంకర హర హర శంకర**



# ట్రేడ్, ట్రెడిషన్, టెక్నాలజీ ఈ విశిష్టమైన త్రివేణి సంగమము దేశానికి అవసరము



గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః గురుర్ దేవో మహేశ్వరః
గురుః సాక్షాత్ పరం బ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః

విదేశీ దృష్టికోణం లాభం, ధనం ప్రధానంగా ఉంటుంది. ఇప్పుడు వచ్చే కొత్త techno engineeringతో కలుపుకుని వ్యవసాయము చేతి పనుల ద్వారా భారతీయ దృష్టికోణం ఉంటుంది. ప్రతి భారతీయ కుటుంబంలోనూ పిల్లలకు మంచి భవిష్యత్తు, చదువు ఇవ్వాలన్న తపన ఉంటుంది. నవతరాలకు భక్తి, శ్రద్ధ, వినయం, ధర్మము, ఆచారము, సంస్కృతుల గురించి కూడా చెప్తూ వుంటాము. కానీ బాగా చదువుకొమ్మని, మార్కులు బాగా రావాలని దాని వల్ల యోగ్యత పెరుగు తుందని చెప్తాము. క్రమశిక్షణ, కటిబద్ధత ఉన్నందువల్లే సంకల్పాలు పెరుగుతాయి. కానీ అవకాశాలు అంది రావడానికి పూర్వ భాగ్యము వుండాలని ప్రత్యక్ష పరిస్థితి ద్వారా తెలుస్తుంది. వ్యవసాయాన్ని నమ్ముకున్న ఈ భూమినుండి కూడా పూర్వం అవకాశాలకోసం మారిషస్, ట్రినిడాడ్, ఫిజి , ఆఫ్రికా లాంటి దేశాలకు వెళ్లి పనులు చేయాల్సి వచ్చేది. రెండు శతాబ్దాలకు ముందు శ్రీలంక జనాభాలో కొందరు బీహారు రాష్ట్రానికి చెందినవారుగా గుర్తించారు. సంపన్నులు లండన్‌కు వెళ్ళి స్థిరపడిన వాళ్ళు వున్నారు. మన దేశ స్వాతంత్ర సంగ్రామంలో నేతృత్వము చేసిన వాళ్ళలో చాలా మంది లండన్‌లో చదువుకున్న వారే. వారిలో పాశ్చాత్య ప్రభావం – భారతీయ భావం వున్నవారు ఎక్కువ.

1947లో స్వాతంత్రం వచ్చినప్పుడు ఇచ్చిన మహాస్వామి వారి సందేశంలో – అదృష్టవశాత్తు దేశ చిహ్నంలో ధర్మ చక్రం వున్నది – ధర్మం మనం చెప్పక పోయినా, ఆచరించకపోయినా జన్మ వ్యర్థం అని చెప్పారు. గుడిలోపల చైతన్యవంతమైన సాన్నిధ్యం

వున్నట్టుగా ధర్మచక్రాన్ని ప్రవర్తింప చేయాలని సూచించారు. ఈ దేశం యొక్క వ్యక్తిత్వం, ఆత్మ, ప్రాణం, ధర్మమును ప్రవర్తింప చేయడంలో తెలుస్తుంది. దేశ స్వభావం ప్రజల ఆకాంక్ష తెలుసుకోవాలంటే – వారి ధర్మ సంస్కృతి తెలుసుకోవాలి. సనాతన ధర్మమే భారతీయ సంస్కృతి. 'లోకాస్సమస్తా సుఖినోభవంతు 'అనే నానుడి సనాతన ధర్మ ఉద్దేశ్యం. అందువల్ల సమాజ వికాసంలో అందరూ భాగస్వాములు కావాలి.

పాతరోజుల్లో ధర్మ ప్రచారం కోసం ప్రభుత్వ సహాయ సహకారాలు ఉండేవి. శ్రోత్రియం (సర్వమాన్యము) – అనే ఒక కాన్సెప్ట్ ఉండేది. శ్రోత్రియం అంటే సౌకర్యాలు అందించి, వారు సేవ చేసే విశ్వాసాన్ని బలపరచడం. కంచి పక్కన కలవై (జీవ బ్రహ్మ ఐక్యం), చతుర్వేద మండలం, సూళ్ళూరుపేట అగ్రహారాలు అలా ఏర్పడినవే. ఒరిస్సా రాష్ట్రంలో చతుర్వేద మండలం ఏర్పాటు చేసి సామవేదం లోని మూడు శాఖలు నేర్పిస్తున్నారు. సహస్రవర్త్మ సామవేద అని సామవేదంలో 1000 శాఖలు వుండేవి. కానీ ఇప్పుడు 3 శాఖలు మాత్రమే లభ్యత ఉన్నది. మిగిలిన వాటి పేర్లు మనకు తెలియవు. 1000 సంవత్సరాలకు ముందు సామవేద శాఖ 'ఆరుణి' పాఠ ప్రవచనము కోసం భూదానము, సత్కర్మలు చేయాల్సి వచ్చినట్టుగా ఒరిస్సా ఉత్కళ ప్రాంతములో శిలాశాసనము వున్నది.

ఇప్పుడు హిందూదేశ చరిత్ర సాధారణంగా చదువు కుంటున్నారు. కానీ హిందూ దేశ చరిత్ర, జీవన విధానము, సంస్కృతి, పరిపాలన, యాజమాన్యము, వ్యాపారం, తత్వ శాస్త్రం, లేబర్ పాలసీ, ప్రజా శ్రేయస్సు, దక్షత, సామర్థ్యం, జ్ఞానం, హృదయం, సంపద, వారసత్వం, వినియోగం, ప్రేమ, బాధ్యత, అధికారాలు మొదలైన అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవలసిన అవసరం వుంది.

1947లో దేశవిభజనకు మహాస్వామివారు సుముఖంగా లేరు. పాకిస్థాన్ హిందుస్థాన్ కాకుండా 'సంత్ స్థాన్ ' గా కలిసి వుండాలని వారి ఆశయం. అప్పుడు దేశంలో వున్న కలహాలు, కష్టాలు నవతరాలకు కలుగకూడదన్నది వారి నిశ్చిత అభిప్రాయం. అందరూ సౌజన్యంగా వుండాలన్న అభిప్రాయంతో ప్రతి ఆదివారం సాయంత్రం తర్వాత ఏమి తినకుండా భిక్ష విషయంలో స్వయం నియంత్రణం చేసుకున్నారు. శాంతి భద్రతలు సమాజ వికాసానికి ముఖ్యమని ఆయన ఉదేశ్యం. అధికారం కోసమో ప్రజలలో స్పందన కోసమో కాకుండా ధర్మోద్యేశం ప్రకారం ప్రజలకు హితం జరగాలని అలా చేశారు.

జీవనోద్ధారము, జీవుడిలో ఉద్ధారము రెండూ మనం గమనించుకుంటూ ఉండాలి. మన దేశ అభివృద్ధి, భక్తి, సదాచారము,





పురాణ శ్రవణం, నిత్య కర్మానుష్టానం, సౌమ్యత, సత్యము, మొదలగు ఆత్మ గుణ స్వభావాల ఆధారంగా వుంటుంది. దేశ స్వభావం - ఆత్మగుణ సంపన్నము. వ్యాపారంలో ధర్మం ఉండాలి కానీ ధర్మంలో వ్యాపారము వుండకూడదు అనే విశిష్ట నీతి మన దేశంలో వుండేది. ధర్మమనేది ఆచరణ. ఆత్మ సంతృప్తిని ఇస్తుంది. ప్రదర్శనలా వుండకూడదు. సనాతన హిందూ ధర్మం శాంతికోసం పనిచేస్తుంది. భారతీయ జీవన విధానం దీర్ఘ కాలానికి ఉపయోగపడే విధంగా ఉంటుంది.

ఇక్కడ దిలీపుని కథ సమంజసముగా ఉంటుంది. దిలీప మహారాజు సంతాన ప్రాప్తికోసం వసిష్ఠ మహర్షి ఆదేశం ప్రకారము 21 రోజులు గోసేవ చేస్తారు.

***'విధేః సాయంతనస్యాంతే సహధర్మ తపోనిధిం***
***అన్వాసితమమరుంధత్యా స్వాహాయేవ హవిర్భుజా***

గురువు దర్శనం కొరకు వెళ్ళినపుడు మనం పరిమిత సౌకర్యాలు చూసుకుని వెళ్ళాలి. ఆయన అనుష్టానములకు, పూజకు విఘ్నం కలిగించకూడదు. ఆ రాజు అడవిలో చెట్టు పుట్టలను పరికిస్తూ పక్షులను పరిశీలిస్తూ ఆశ్రమానికి వెళ్లారు. సంధ్యావందనం అయిన తర్వాత తపోనిధి వసిష్ఠ మహర్షిని కలుసుకున్నారు. తపస్సు అనేది జీవితంలో అనుసూతంగా వస్తూవుంటుంది. అందువల్ల దానిని నిధి అంటారు. మాటలలో, భోజనంలో, చూపుల్లో ఆ తపస్సు ఒక కవచంలా ఉంటుంది. భారతీయ విశిష్టతలలో ఈ తపస్సు కూడా ఒకటి.

***ప్రస్థితాయాం ప్రతిష్ఠేథాః స్థితాయాం స్థితిమ్ ఆచారేః,***
***నిషణ్ణాయాం నిషేదాస్యాం పీతాంభసి పిబేరపః***

అపుడు వశిష్ఠ మహర్షి గోసేవలో భాగంగా ఆవు కూర్చుంటే కూర్చోవాలి, నిలబడితే నిలబడాలి, నిద్రపోతే నీవుకూడా పడుకోవచ్చు అని చెప్పారు. కామధేనువు యొక్క బిడ్డ అయిన నందిని గోవుకు 21 రోజులు సేవ చేసుకున్నాడు దిలీపుడు. ఒకరోజు ఆవు ఒక గుహలోకి వెళ్ళింది. అక్కడ దేవదారు వృక్షాన్ని కాపాడడానికి పార్వతీదేవి కుంభోదరుడు అనే అతన్ని కాపలాదారుడిగా పెట్టిందట. దేవికి ఆ వృక్షము అంటే అపరిమితమైన వాత్సల్యమట. ఆవును చూసిన కాపలాదారుడు సింహరూపంలో దాని మీదకు దూకే సమయంలో దిలీపుడు అక్కడికి వస్తాడు. మా గురువుల గోవు కాబట్టి దీనిని కాపాడటం నా బాధ్యత అని భావించి నన్ను చంపి గోవును వదిలిపెట్టమని చెప్తాడు. ఆ సమయంలో తలవంచి కూర్చున్న దిలీప మహారాజు మీద పుష్పవర్షం కురిసిందట. జీవరాశికోసం అధికారం, జీవితం స్వప్రయోజనాలు వదులుకున్న మహాత్ములు పుట్టిన దేశం మన భారత దేశం.

***ఉత్తిష్ఠ వత్సేతి అమృతాయమానం,***
***వచో నిశమ్య ఉత్థితముత్థితః సన్***

అప్పుడు కుంభోదరుడు నిజరూపంలోకి వచ్చి 'మహారాజా ఇది కామధేను లీల. ఇదిగో ఈ పాలు త్రాగి సంతాన ప్రాప్తి పొందండి' అని చెప్పాడు. ఎంతటి అవసరంలో వున్నా పాలు గ్రహించకుండా గురు అనుమతికోసం వశిష్ఠులవారి వద్దకు వస్తాడు దిలీపుడు. ఆ రోజుల్లో కర్మయోగంను పద్ధతిగా ఆచరించేవారు. ఎన్ని సీసీటీవీలు పెట్టినా ఇప్పుడు సాధ్యమవడం లేదు. మనంతట మనలో మార్పు రానప్పుడు ఎన్ని సీసీటీవీలు పెట్టినా ఫలితం ఉండదు.

అవసరం ఆవశ్యకత ఉన్నా తొందరపడి చేయకపోవడం అనేది భారతీయుల లక్షణంగా వుండేది. ఇపుడు కూడా మనం రామాయణం, భారతం, భాగవతం చదివితే చాలా తెలుసుకోవచ్చు.



ఆ రోజుల్లో భారత దేశంలో జీవన విలువలు ముఖ్యంగా ఉండేవి. ఆకలి వుండాలి గాని కలి వుండకూడదు. ఒకప్పుడు ఆపదలు రాకుండా ముందు జాగ్రత్తగా ఉండడం జరిగేది. ఒకరి సౌఖ్యం కోసం ఇంకొకరి కష్టాన్ని మనం కోరుకోకూడదు. ఆయుర్వేదం, సంగీతం, యోగ శాస్త్రం, జ్యోతిషం శాస్త్రాల్లో భద్రత విషయం మీద చర్చ వుంటుంది. నిదానంగా తీసుకున్నా సరైన నిర్ణయాలు తీసుకోవాలి. శత్రువుకి హింస కలుగకుండా విజయం సాధించడం ఒక కోణమైతే, శత్రువు చేత మనకు హింస కలుగకుండా విజయం సాధించడం మన దేశ ధ్యేయంగా ఉండాలి. (సమ్మోహనాస్త్రం ప్రయోగిస్తే శత్రువుకి హింస ఉండదు మనకు విజయం వస్తుంది.) అంటే ప్రేమ, సత్యం, ధర్మం మార్గాలలో విజయం సిద్ధిస్తుంది. పారమార్థిక సత్యాన్ని మనము అన్వేషించాలి. ధైర్యం లేకనో తెలివి లేకనో కూర్చోలేదు మనం. శాంతి, భద్రత, అహింసల యందు నమ్మకం వున్నవాళ్ళం కాబట్టి నిర్ణయంకోసం సమయం తీసుకుంటాము. భారతీయ నిర్ణయాలు దీర్ఘకాలానికి పనికివచ్చి సమస్త జీవరాశికి పనికి వస్తాయి. మన దృష్టికోణం కేవలం ఒక వ్యక్తి కోసం కాదు. సమాజవృధి కోసం వెచ్చించాలి.

ఇక్కడ ఒక వైపు ఐటి వాళ్ళు, ఒక వైపు వేదశాస్త్ర పండితులు ఉన్నారు. ఇప్పుడు విజ్ఞానము, విశ్వాసము రెండూ కలిసిన వికాసము మనకు కావాలి. దానికోసం మీలో అవగాహన పెరగాలి. శాస్త్రం, టెక్నాలజీ కాకుండా మన సంస్కృతి, వంశపారంపర్య విలువలు, ఆచార వ్యవహారముల గురించి తెలుసుకుని ఉండాలి. దానికోసం విద్యావిధానంలో మార్పులు రావాలి. సమస్త ప్రపంచానికి మన ఆలోచనలు విలువల గురించి తెలియ చెప్పాలి.

దాని కోసం ప్రస్తుతం ఒక 'పరిచయ' అనే వేదికను మొదలు పెట్టించాము. కొంతకాలం క్రిందట 'గణపతి స్థపతి' గారితో జరిపించినపుడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి చిత్రం వేయడానికి దాదాపు 400 మంది విద్యార్థులు అనేక పాఠశాలల నుండి వచ్చి పాల్గొనడం జరిగింది. పాదం, కటి, ఊరు, ఉదరం, కంఠము, శిరస్సు, బాహువు అన్ని భాగముల కొలతలు భారతీయ శిల్పశాస్త్రము ప్రకారం తీసుకొనడం జరిగింది. భారతీయ శిల్పశాస్త్రం ఆయుర్వేదం, గణితం, ఛందోవిజ్ఞానం, సాహిత్యం,సంగీతం, పురాణాలు అన్నింటి గురించి చర్చ జరిగింది. ఇప్పుడు టెక్నాలజీ, సైన్సు కలిసినాయి. పురాణాలు గురించి చదివిన 'కస్తూరి రంగన్' అనే సైంటిస్ట్ ఇక్కడ మా దగ్గరకు వచ్చి భూగోళం, పురాణాలు, ద్వీపాల పేర్లు లాంటివి తెలుసుకుని వెళ్ళారు. గణితశాస్త్రంలోని కొలతలు యోజనం, శతయోజనం మొదలగు వాటి గురించి చర్చించారు.

గుడి తోరణం వచ్చిన తర్వాతనే గాలి గోపురం, అర్థమంటపం, మహామంటపం, గర్భ గుడి అనేవి వస్తాయి. మీరందరూ భారతీయ విజ్ఞానాన్ని కాపాడటానికి సంపద, సమయం, సామర్థ్యం వినియోగించాలి. ఇక్కడికి వచ్చిన వేదం పండితుల నుండి పద్ధతులు, సూత్రాలు తెలుసుకునే ప్రయత్నం చేయండి. (ఇప్పుడు వేదపండితుల ద్వారా ఇవ్వబడిన గోత్ర సూచి, పెద్ద బాలశిక్ష, కాలామృతం అనే పుస్తకాల ద్వారా మీకు మీరే ప్రచారకులు.) నిత్యం ధర్మము కోసం కొంత సమయం ఇవ్వండి. సాంకేతికను మన ధర్మాన్ని అభివృద్ధి చేయడానికి ఉపయోగించండి. Trade, tradition, technology – మూడు కలిసి విశిష్టమైన త్రివేణి సంగమము కావాలి. అందరూ కలిసి పనిచేయడానికి 'సంఘే శక్తేః కలియుగే' అనేదానికి సైన్యం కావాలి. (అహింసా సోల్జర్స్). వారికి నేతృత్వం ధృడంగా వుండి మంచి ఆలోచనలతో లోక క్షేమం కలిగించాలి.

**జయ జయ శంకర – హర హర శంకర**



# కంచిలోని శ్రీ కామాక్షి అమ్మవారికి ఐదు రూపాలు వున్నాయి

మొదటిది బిలాకాశం. అమ్మవారు ఎక్కడి నుంచి ఆవిర్భావం అంటే ప్రకటన అయినారో అంటే కొన్ని ద్వారాలున్నాయి ఆ గర్భగుడిలో. బిలాకాశం అంటారు. దేవతలకు మనము ఇప్పుడు గర్భగుడిలో మూలవిరాట్టుగా చూస్తున్న అమ్మవారి యొక్క స్వరూపం అక్కడినుండే ప్రకటమైంది. ఆ బిలాకాశానికి సంవత్సరంలో ఒక పర్యాయం మాత్రమే అభిషేకం జరుగుతుంది. ఆశ్వయుజ మాసం పూరం నక్షత్రంలో జరుగుతుంది. మన స్వామివారు కూడా మధ్యాహ్నం వచ్చి అభిషేకం చేసేవారు. పాలాభిషేకం చేస్తారు. ఆవిర్భావ రోజు అది.

రెండవది తపస్ కామాక్షి. అంటే ఒక కాలు పైని పెట్టుకుని పంచాగ్ని తపస్సు చేసే కామాక్షి.

మూడోది గర్భగుడిలో మనము దర్శనం చేస్తున్న మూలమూర్తి కామాక్షి.

జింకలాగా మంచి కన్నులు కలది. పాపాలు, దోషాలు తొలగించే శక్తి కలది ఈ అమ్మవారు. అమ్మవారి శక్తి ఇంత అని చెప్పడానికి సాధ్యం కాదు.

ఇక నాలుగవది ఉత్సవ కామాక్షి – ఊరేగింపు, బ్రహ్మోత్సవాలు, బంగారు రథం, సింహ వాహనం, మోహినీ అలంకారం. మోహిని

అలంకారం రోజు అమ్మవారు మన కంచి పీఠానికి వస్తారు. అలా రథోత్సవాలు – వెండి రథం మన స్వామివారు చేయించారు.

1944 ఆ ప్రాంతంలో స్వామివారు శ్రీ కామాక్షి గుడికి కుంభాభిషేకం చేశారు. ఆ సందర్భంలో మూక పంచశతి అనువాదంతో సహా 5 పండితులకు చెప్పి శ్రీముఖం వారే ఇచ్చి పుస్తకరూపంలో ఆవిష్కరింపచేశారు. 1944 కంటే 4 తరాలకు ముందు ఉన్న కంచి కామకోటి పీఠాధిపతులు కామాక్షి అమ్మవారికి కుంభాభిషేకం చేశారు. అమ్మవారు కలలో కనిపించి, వారు కంచికి వచ్చి కుంభాభిషేకం చేశారు. ఒక శిలాలేఖనం అమ్మవారి గుళ్లో వుంది. తెలుగులో వ్రాసి వుంది. 'కుంభాభిషేకం చేసి సకలజన సంతోషం చేసిరి' అని వుంది.

కుంభాభిషేకం యొక్క తాత్పర్యం అందరికి కూడా సంతోషం కలిగించడం అని ఆ శిలాలేఖనంలో వుంది. ఆ రోజు కుంభాభిషేకం చేశారు. స్వామివారికి 4 తరాల ముందున్న పీఠాధిపతులు వచ్చిచేసారు. స్వామివారు ఈ మూకపంచశతి అనే కావ్యాన్ని భాషా అనువాదంతో ముద్రించినారు. అలా మన జయేంద్ర సరస్వతి స్వామివారు 1976లో కుంభాభిషేకం చేసినప్పుడు ఈ 500 శ్లోకాలు మూక పంచశతి శిలలలో దేవనాగరి లిపిలో అక్కడ పెట్టించారు. అలా ఇది ఉత్సవ కామాక్షి నాలుగవది.

అయిదవ కామాక్షి బ్రహ్మదేవుడు పూజించిన బంగారు కామాక్షి. ఆ కామాక్షి అమ్మవారి గుడి తంజావూరులో వుంది. ఈ అయిదు కలిపి దర్శనం చేసుకోవడం ఆనవాయితీ. అందుకే స్వామివారు బంగారు కామాక్షి సన్నిధిలో పాదుక ప్రతిష్ఠ చేశారు. అంటే భక్తులు కామాక్షి దర్శనం చేసుకోవాలన్న ఉద్దేశ్యం తో అమ్మవారి గుళ్ళో పెట్టించారు. మునుపు బంగారు కామాక్షి అమ్మవారు కంచిలో ఉండేది. దాడులు జరిగిన చరిత్ర కారణం చేత ప్రస్తుతం తంజావూర్లో వుంది. ఈ పంచ కామాక్షి అమ్మవార్ల దర్శనం చేసుకోవాలి.

**భక్తుడి ప్రశ్న:** అమ్మవారిని కుండలినీ స్వరూపిణిగా చూస్తారు. శరీరంలో మూలాధారంలో కుండలిని స్థితిలో వున్నది అంటారు. బహిర్గతంగా విగ్రహ రూపంలోనూ మనకు చూపిస్తూ వుంటారు. విగ్రహంగా ఆరాధిస్తే ఈ కుండలిని కదులుతుందా అనేది ఒకటి, ఈ కుండలిని వున్నపుడు బహిర్గతంగా ఆరాధించాల్సిన అవసరం ఏముంటుంది?

**స్వామివారు:** ఉపాసన విషయంలో నిదానంగా వెళ్ళాలి అందరు కూడా. ఆ చక్రం ఇంకొక వైపు తిరిగితే మనకు ఇబ్బంది అవుతుంది. అందుకని ఈ యోగం కానీ ఈ ఉపాసన మార్గాలు కానీ గురోపదిష్ట మార్గేణ వెళ్ళాలి. వారు అప్పుడప్పుడు చూసి 'పాస్' చేస్తారు. తగిన మంత్రం నేర్పిస్తారు. ఒక్కసారిగా మొత్తం జరగదు. ముందు గణపతి మంత్రం ఇస్తారు. తర్వాత బాలా మంత్రం ఇస్తారు. ఆ పిదప అవసరమైన మంత్రాన్ని ఇస్తారు. నిర్ణీత లక్షల సంఖ్యలలో జపం చేయమంటారు.

మన స్వామివారి దగ్గర ఒక మహారాష్ట్ర స్వామివారు ఉండేవారు. ఊగార్ స్వామి అని ఆయన పేరు.

ఆహార నియమాలు, ఆలోచన నియమాలు – ఇవన్నీ మంత్ర శాస్త్రానికి ముఖ్యం. మంత్ర శాస్త్రంలో మనం ఎంత అనుకూల ఫలితాలు ఆకాంక్షిస్తున్నామో అంత జాగ్రత్త కూడా ముఖ్యం. కొందరు శ్రీచక్రం ఇస్తామని శ్రీమేరు ఇచ్చేస్తామని చెప్పినా తీసుకునేవాళ్ళు ఆలోచించాలి. ఒక క్రమపద్ధతి అనేది ముఖ్యం.

ముందు స్తోత్రం నుంచీ ప్రారంభించాలి – సౌందర్య లహరి లాంటి స్తోత్రాలన్నీ చేస్తూ చేస్తూ తర్వాత నామ జపం ప్రారంభిస్తూ ఆ పిదప మంత్ర దీక్ష అలా చేస్తూ పద్ధతిగా ముందుకు వెళ్ళాలి. యోగ విషయంలో మనం ఆసనం నుంచీ ప్రారంభించి తర్వాత ధ్యానానికి వెళ్ళాలి. కృష్ణమాచార్య అని ఒకరు వంద సంవత్సరాలు జీవించారు. ఆయన కూడా స్వామివారి మీద భక్తి ప్రపత్తులతో ఉండే వారు. ఆయన యోగ శాస్త్ర ప్రకారంగా ప్రచారం చేసి శతాభిషేక ఉత్సవం కూడా చేసుకున్నారు. మేము వారికి ప్రసాదాలు అన్నీ పంపించాము. బాగా చేసుకున్నారు ఆయన. ఆయన యోగశాస్త్రం శాస్త్రీయంగా నేర్చుకున్నారు. జపానికి, యోగ సాధనికి, ఆ ధ్యాన పద్ధతికి కనెక్టివిటీ ఉండాలి. డిస్కనెక్ట్ అయినా కష్టం. విరుద్ధంగా కనెక్ట్ అయినా కష్టం. 3 ఫేస్ 2 ఫేస్ అంటూ ఉంటాం కదా కరెంట్ విషయంలో అలా అనమాట. అంచెలంచులుగా వెళ్ళాలి. శాస్త్రాల్లో కొన్ని విషయాలు పద్యంలాగ చదువుకోవచ్చు. కొన్ని విషయాలు అభ్యాసక్రమాలు అవన్నీ గురుముఖంగా తెలుసుకొని ఆ విధముగా ముందుకు వెళ్ళాలి.



# మూకపంచశతి ఆర్యాశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

శ్లో॥ స్మయమానముఖం కాంచీమ్ అయమానం కమపి దేవతాభేదమ్.
దయమానం వీక్ష్య ముహుః వయమానన్దామృతామ్బుధౌ మగ్నాః. ॥29॥

**పదవిభాగం:-** స్మయమానముఖం- క్చామ్- అయమానమ్- కమ్- అపి- దేవతాభేదమ్- దయమానమ్- వీక్ష్య- ముహుః- వయమ్- అనన్దామృతామ్బుధౌ- మగ్నాః.

**అన్వయం:-** స్మయమానముఖం క్చాం అయమానం దయమానం కం అపి దేవతాభేదం ముహుః వీక్ష్య వయం ఆనన్దామృతామ్బుధౌ మగ్నాః.

**ప్రతిపదార్థం:-** స్మయమానముఖమ్-=చిరునవ్వులు చిందించు ముఖమును, క్చామ్=కాంచీనగరమును, అయమానమ్=చేరుకున్న, దయమానమ్= దయచూపుచున్న, కం అపి= ఒకానొక, దేవతాభేదమ్= దేవతావిశేషమును, ముహుః =మాటిమాటికి, వీక్ష్య=చూచి, వయమ్= మేము ఆనన్దామృతామ్బుధౌ= అనందమనే అమృతసాగరంలో, మగ్నాః. = మునిగినవారమైతిమి.

**తాత్పర్యము:-** చిరునవ్వులు చిందిస్తూ దయను జూపుచున్న ఒకానొక దేవతా విశేషము కాంచీ నగరమును చేరుకున్నది. ఆ తల్లిని మాటిమాటికి చూస్తూ మేము అనందామృతసాగరంలో మునిగియున్నాము.

**బాలమనోజ్ఞా:-** కామాక్షీదేవి కంపానదీతీరమును తన నివాసముగా యెంచుకుని చిరునవ్వులు చిందిస్తూ కాంచీనగరములో సుస్థితయై ఉన్నది. ఆ తల్లి తన చిరునవ్వులొలుకు కన్నులతో పరమకారుణ్యాన్ని చూపుతూ ఉన్నది. అటువంటి కారుణ్యమూర్తిని చూస్తూ బాహ్య ప్రపంచము వైపు దృష్టిని సారించలేము. ధ్యానస్థితిలో ధ్యేయవస్తువైన ఆ తల్లిపై దృష్టి ఉంచి బాహ్య విషయాలను త్యజించటమే ఆనందం. అదియే అమృతసముద్రము. దానిలో మునిగినవానికి చావుపుట్టుకలభయమే ఉండదు కదా!

శ్లో     కుతుకజుషి కాంచిదేశే కుముదతపోరాశి పాకశేఖరితే.

కురుతే జనో మనో౽యం కులగిరిపరిబృ(వృ)ఢ కులైకమణిదీపే.     ॥30॥

**పదవిభాగం:-** కుతుకజుషి –క్చాదేశే–కుముదతపోరాశిపాకశేఖరితే–కురుతే –జనః– మనోః–అయమ్–కులగిరిపరిబృ(వృ)ఢకులైకమణిదీపే.

**అన్వయం:-** క్చాదేశే కుతుకజుషి కుముదతపోరాశిపాకశేఖరితే కులగిరిపరిబృ(వృ)ఢకులైకమణిదీపే అయం జనః మనః కురుతే.

**ప్రతిపదార్థం:-** క్చాదేశే = కాంచీనగరప్రదేశమునందు, కుతుకజుషి = కూతూహలమును పొందిన, కుముదతపోరాశిపాకశేఖరితే= చంద్రుని శిరోభూషణముగా గల

కులగిరిపరిబృ(వృ)ఢకులైకమణిదీపే = కులపర్వతాలకు ప్రభువైన హిమవంతుని కులమునకు మణిదీపమైన అమ్మవారియందు, అయం= ఈ, జనః= జనుడు, మనః=మనస్సును, కురుతే = చేయుచున్నాడు



**తాత్పర్యము:-** కాంచీనగరవాసమునందు కుతూహలముగల, చంద్రుని శిరోభూషణముగా ధరించిన, కులపర్వతాలకుప్రభువైన హిమవంతుని కులమునకు మణిదీపమై ప్రకాశిస్తున్న అమ్మవారి యందు ఈ జనుడు (మూకకవి) మనస్సును ఋలిగియున్నాడు.

**బాలమనోజ్ఞా:-** అమ్మవారు కాంచీనగరము నందలి కుతూహలముతో ఇక్కడ పరివేష్టితయై ఉన్నది. ఆమె శిరోభూషణము చంద్రుడు. చంద్రుడు కలువపూవుల తపోరాశి. అనగా చంద్రుని కోసం పరితపించిన కలువపూలు చంద్రుడు రాగానే వికసిస్తాయి. అటువంటి చంద్రుని శిరస్సు యందు అలంకారంగా ధరించిన ఆ తల్లి ముఖము "రాకాచంద్రసమానకాంతివదనా" పూర్ణచంద్రుని కాంతివంటి కాంతి కలిగినది. అటువంటి ఆమె ముఖము చూడగానే కామాక్షీభక్తుల మనస్సులు కలువపూల వలె వికసిస్తాయి.

ఇంకా అమ్మవారు కులపర్వతాలకు రాజైన హిమవంతుని పుత్రిక. ఈవిడ పుట్టగానే ఆ హిమవంతుని వంశాన్ని మణిదీపమై ప్రకాశింపజేసినదట. వంశము యొక్క కీర్తి తన సంతతి వలన వృద్ధి చెందుతుంది. అప్పటివరకు కేవలం పర్వతరాజుగా మాత్రమే ప్రసిద్ధినొందాడు హిమవంతుడు. ఎప్పుడైతే అమ్మవారిని హైమవతి అని దేవర్షిగణాలు స్తుతిస్తున్నాయో అప్పటినుండి హిమవంతుని కీర్తి ఇంకా ఇనుమడించినది. ఆ

మణిదీపపు కాంతి భక్తుల మనస్సులలోని అజ్ఞానమనే అంధకారాన్ని పోగొట్టి జ్ఞానదీపమై ఉన్నది. చంద్రునికాంతి, మణిదీపపు వెలుగు రెండూ కూడా మనలోని చీకటిని పారద్రోలి జ్ఞానప్రకాశాన్ని కలిగించేవి. జ్ఞానప్రకాశరూపమైన ఆ తల్లి యందే మూకకవి యొక్క మనస్సు ఉన్నదిని భావము.

శ్లో॥ వీక్షేమహి కాంచిపురే విపులస్తనకలశగరిమపరవశితమ్.
విద్రుమసహచరదేహం విభ్రమసమవాయసారసంనాహమ్. ॥31॥

**పదవిభాగం:-** వీక్షేమహి- కాంచిపురే-విపులస్తనకలశగరిమపరవశితమ్-విద్రుమసహచరదేహమ్-విభ్రమసమవాయసారసన్నాహమ్.

**అన్వయం:-** కాంచిపురే విపులస్తనకలశగరిమపరవశితం విభ్రమసమవాయసారసన్నాహం విద్రుమసహచరదేహం వీక్షేమహి.



**ప్రతిపదార్థం:-** కాంచిపురే= కాంచీనగరము యందు, విపులస్తనకలశగరిమపరవశితం = పెద్ద కలశముల వంటి స్తనముల బరువుచే పరవశించిన, విభ్రమసమవాయ సారసన్నాహం = విలాసముల సమూహపు సారము యొక్క కవచము గల, విద్రుమసహచరదేహం = పగడములకు సహచరమైన దేహము గల అమ్మవారిని, వీక్షేమహి= చూచెదము గాక.

**తాత్పర్యము:-** కాంచీనగరమున పెద్దకలశముల వంటి స్తనముల భారముచే పరవశమందిన, విలాసములే కవచముగా కలిగిన, పగడపురంగు గల దేహము కలిగిన అమ్మవారిని చూచెదము గాక.

**బాలమనోజ్ఞా:-** యౌవనమునందున్న స్త్రీయొక్క హావములు ఏవిధంగా ఉంటాయో ఆ విధంగా అమ్మవారిని వర్ణిస్తున్నారు. హావములనగా స్త్రీల శృంగారభావజములని. శృగారభావజములన్నీ అమ్మవారి నుండి పుట్టినవే. అందుకే విద్రుమవర్ణంలో ఆ తల్లి ప్రకాశిస్తోందని వర్ణించారు. విద్రమమంటే పగడము. పగడము ఎర్రనిది. ఎరుపు రాగానికి ప్రతీక. తన దేహపు కాంతితో తన భర్తయైన ఈశ్వరుని రంజింపచేస్తున్న ఆ తల్లిని చూస్తామని కవి తాత్పర్యము.

శ్లో॥ కురువిన్దగోత్రగాత్రం కూలచరం కమపి నౌమి కమ్పాయాః.
కూల్కషకుచకుమ్భం కుసుమాయుధవీర్యసారసంరమ్భమ్. ॥32॥

**పదవిభాగం:-** కురువిన్దగోత్రగాత్రం-కూలచరం- కమ్ం అపి- నౌమి- కమ్పాయాః-కూల్కషకుచకుమ్భం-

కుసుమాయుధవీర్యసారసంరమ్భమ్.



**అన్వయం:-** కురువిన్దగోత్రగాత్రం కమ్పాయాః కూలచరం కిం౦ అపి కూల్కషకుచకుమ్భం కుసుమాయుధ వీర్యసారసంరమ్భం నౌమి.

**ప్రతిపదార్థం:-** కురువిన్దగోత్రగాత్రమ్ = కురువిన్దమణుల వంశమున పుట్టినట్లున్న శరీరముగల, కమ్పాయాః = కంపానదియొక్క, కూలచరమ్ = ఒడ్డున తిరుగుతున్న

కిం౦ అపి = ఒకానొక, కూల్కషకుచకుమ్భమ్ = గట్టున ఒరసికొనుచున్న కుండల వంటి స్తనములు గల, కుసుమాయుధ వీర్యసారసంరమ్భమ్ = మన్మథుని వీర్యసారవేగమును (అమ్మవారిని), నౌమి = నమస్కరించెదను.

**తాత్పర్యము:-** కురువిందములయొక్క వంశమున పుట్టినట్లున్న శరీరకాంతిగల, కంపాతీరమున విహరించు కూలమలనొరయు కుండలవంటి స్తనములు గల ఒకానొక మన్మథుని వీర్యసారవేగమైన అమ్మవారిని నమస్కరించెదను.

**బాలమనోజ్ఞా:-** కురువిందగింజలు నలుపు ఎరుపుల వర్ణములలో ఉంటాయి. అమ్మవారు పర్వతములకు రాజైన హిమవంతునికి పుట్టిన కారణంగా కురువిందమణులు అక్కడే ఉంటాయి కాబట్టి సహజంగానే గోత్రాన్ని బట్టి లేదా వంశాన్ని బట్టి రంగు వస్తుంది కాబట్టి అమ్మవారి దేహపు ఛాయ కురువిందమణుల వర్ణంలో ఉందని చెప్తున్నారు. కవి. ఆ తల్లి హిమవంతునికి పుట్టినప్పటికి విలాసంగా విహరించే ప్రాంతం మాత్రం కంపాతీరమే. యౌవనంలో ఉన్న ఆ తల్లి యొక్క స్తనములను వర్ణిస్తూ మన్మథుని వీర్యసారవేగముగా ఉన్న అమ్మవారికి నమస్కరించెదను. మన్మథుని ప్రతాపం అమ్మవారి నుండే వచ్చినది.

# శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి విజయయాత్ర విశేషాలు







**01 జూన్ 16, 2024:** పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివారు చెన్నైలోని తొండియార్‌పేటలో అగస్త్య TNK కుటుంబం-శంకర నేత్రాలయ ప్రతిపాదిత నిర్మాణానికి భూమిపూజ చేసి ఆశీర్వదించారు.






**02 జూన్ 16, 2024:** పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివారు తిరువొత్తియూరులోని శంకరాచార్య కాలనీలో శ్రీ కంచి కామకోటి పీఠం 61వ ఆచార్య పూజ్యశ్రీ మహాదేవేంద్ర సరస్వతి (IV) శంకరాచార్య స్వామివారి అధిష్ఠానాన్ని సందర్శించారు.

61వ ఆచార్యులైన శ్రీ మహాదేవేంద్ర సరస్వతి IV శంకరాచార్య స్వామివారు, ఇప్పుడు చెన్నైలో భాగమైన తిరువొత్తియూర్‌లో క్రోధన సంవత్సర (1746 CE) జ్యేష్ఠ మాసం శుక్ల నవమి నాడు సాయుజ్యం పొందారు. శంకర కాలనీలో ఉన్న శ్రీ వడివుడయమ్మన్ సమేత శ్రీ త్యాగరాజ స్వామివారి ఆలయానికి అరకిలోమీటరు దూరంలో నెలకొని ఉన్న ఈ అధిష్ఠానం వద్ద నిత్యపూజలు ప్రతిరోజూ నిర్వహిస్తారు.




**03 జూన్ 16, 2024:** పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివారు చెన్నైలో తిరువొత్తిరియూర్‌లోని శంకర స్కూల్‌ను సందర్శించి విద్యార్థులు, సిబ్బంది మరియు యాజమాన్యాన్ని ఆశీర్వదించారు.














**04 జూన్ 16, 2024:** పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివారు పూనమల్లి నజరేత్‌పేటలోని జయ జయ శంకర ఇంటర్నేషనల్ స్కూల్‌లో నూతన పాఠశాల భవనాన్ని మరియు శ్రీ జయేంద్ర సరస్వతి ఆయుర్వేద కళాశాల మరియు ఆసుపత్రి కొత్త జనరల్ వార్డును సందర్శించారు. స్వామివారు రెండు సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు ఇతర సిబ్బందిని ఆశీర్వదించారు.









**05 జూన్ 21, 2024:** ఉదయం కాంచీపురం శ్రీమఠంలో శ్రీ అనుజ్ఞ గణపతి – శ్రీ ఆదిశంకరాచార్య– శ్రీ సురేశ్వరాచార్య సన్నిధి మండల అభిషేక పూర్తి వైభవంగా జరిగింది. స్వామివారు అభిషేకం, దీపారాధన విధులను నిర్వహించారు.









**11 జులై, 2024:** సాయంత్రం చెన్నై నెమిలిచేరిలో శ్రీ ఆనందవల్లి దేవీ సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయ మహాకుంభాభిషేకంలో భాగంగా జరుగుతున్న యాగశాల పూజలను పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివారు సందర్శించారు.











**12 జులై, 2024:** చెన్నైలోని సైదాపేట శ్రీనగర్ కాలనీలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి - శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామ స్వామి సన్నిధికి పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివారు మహాకుంభాభిషేకం నిర్వహించారు.

శ్రీచంద్రశేఖరేంద్రసరస్వతీ విశ్వమహావిద్యాలయ

# Sri Chandrasekharendra Saraswathi Viswa Mahavidyalaya

(Deemed to be University u/s 3 of UGC act 1956)
(Accredited by NAAC with 'A' Grade)
Enathur, Kanchipuram, Tamil Nadu
Sponsored and run by Sri Kanchi Kamakoti Peetam Charitable Trust



## ADMISSION OPEN 2024-25

### UNDERGRADUATE

**B.E.** (Full-Time/Lateral Entry) Mechanical
CSE | Civil | Mechatronics | ECE | EEE
**B.Tech.** Information Technology
**B.E.** (Part Time) Civil | EEE | Mechanical
**B.Sc.*** CS | Cyber Security | Data Science
Physics | Chemistry | Mathematics
Computer Science with Cognitive Systems **
**B.C.A.*** **B.Com.*** **B.Com.** (BPS)**/(CA)*
**B.B.A.*** **B.Ed.** **B.A.*** (Sanskrit)
**B.P.T.** **B.Optom** **B.A.M.S.**
**B.Sc.** Radiology & Imaging Technology
Cardiac Technology | Dialysis Technology
**LLB^** **B.A. LLB^** **B.B.A. LLB^**

^ Honors Programme; Exclusively for women; Approval Awaited
*4-Year Honours Programme is also offered
Approved by **NCTE/ AICTE/ NCISM** **In collaboration with **TCS**

**Excellent Placement Record**

**Upto 75% Merit Scholarships Available#**

### POSTGRADUATE

**M.E.**
Computer Science Engineering
Engineering Design
Power Systems
Embedded System Technologies
**M.D./M.S.** Ayurveda
**M.B.A.**
**M.Com.**
**M.C.A** (2 Years)
**M.Sc.**
Physics | Chemistry | Mathematics
**M.A.**
Sahitya | Nyaya | Vyakarana
Advaita Vedanta

### MINOR/HONS. DEGREE


AI & ML | 3D Printing | Cyber Security
Microgrid Technology | 5G
Electric Vehicles | Sensor Technology
Robotics | Internet of Things (IoT)
Data Science | VLSI Design

# T&C Apply

www.kanchiuniv.ac.in | admission@kanchiuniv.ac.in | 96290 01144
Transport facility from **Poonamallee, Ranipet, Uthiramerur, Tirutani, Arakkonam, Vandavasi, Chengalpattu**

- Registrar i/c

# శ్రీ కామకోటివాణి
## ప్రత్యేక సంచిక





వెల - 250 రూపాయలు
(Postage 50 రూపాయలు అదనం)

ప్రత్యేక సంచిక కోసము
సంప్రదించవలసిన వివరాలు:

**శ్రీ కంచి కామకోటి క్యాంపు**

Email ID - srikamakotivaani@gmail.com



## For Sri Kamakoti Vaani Subscription



### Bank Details:

**Account Name:**
Sri Kamakoti Touryatrika Trust SKV
Bank: ICICI Bank
Account No.: 440705000345
IFSC Code: ICIC0004407
UPI ID – SRIKAMAKOTIVAANI@icici

### Subscription

₹ 480 INR (India)
₹ 5000 INR
(Lifetime, for 10 years)

e-mail id -
srikamakotivaani@gmail.com

Scan me!

Sri Kamakoti Vaani subscription payment gateway.

Donors may please contact:
**Prayaga Srinivas : 800 800 1335**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



SHRI KANCHI KAMAKOTI PEETAM

JAGADGURU SHANKARACHARYA SWAMIGAL

SHRIMATAM SAMSTHANAM

1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

www.kamakoti.org

fb.me/srikamakoti

youtube.com/kanchimath

twitter.com/kanchimatham

instagram.com/kanchimutt

Koo

koo @kamakoti

www.kamakoti.tv

www.kanchimuttseva.org

ESEVA PORTAL

for Online Puja Bookings & Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA


సర్వప్రీతికరం శాంతం సజ్జనానాం హితే రతం,
యతివర్యం జగత్ పూజ్యం గురుం సర్వగురుం భజే